
మన జీవిత మిపుడొక పూలబాట
భగవంతుని రహస్య స్థావరమునకు మార్గము
ప్రతి సంవత్సరము మన పయనమందొక యోజనము
ప్రతిదినము జ్యోతిర్లోకమున కొక ప్రవేశ ద్వారము.

శ్రీఅరవిందులు

Publishers: Sri Aurobindo Society, Pondicherry - 605 001. Editor: R.L.N. Sastry, Printers: Sri Aurobindo Ashram Press, Pondicherry.
Licensed to post without prepayment at S.A.A.P.O. on 2, 3, & 4 of every month, Regd. No. TN/PMG(NR)WPP 35/2001

శుభాకాంక్షలు 2002

5/1/2002



అఖిల

అఖిల భారత పత్రిక


జనవరి 2002



ప్రభూ! ఈ సంవత్సరాంత సమావేశమున పాతసంవత్సరముతోబాటు పాతబంధములు, భ్రమలు, బలహీనతలకుకూడ వీడ్కోలు పలుకునట్లనుగ్రహింపుము!

గతజీవన స్మృతులు
నూతనజీవితమున ఎట్టి అవరోధములు కల్గింపక
నిత్యజాగరూకతతో వర్తిల్లునట్లు వివేకము వెలిగింపుము
ఈ నూతన వత్సరమున సర్వము
సహజముగా, సంతోషకరముగా, ప్రతిష్ఠాత్మకముగా సంభవించునట్లాశీర్వదింపుము!

శ్రీమాత



దేవా! నీవు సర్వోత్తమ శుభప్రదాతవు!
శుచి, సౌందర్య సౌజన్యములతో
మా జీవనములను పావనము చేయు
మహనీయ దయామూర్తివి! భాగ్యవిధాతవు!
అట్టి నీకు
ఈ నూతన వత్సరపు తొలిజాము
సవినయముగ
సమర్పించుకొనుచున్నారము.
నిన్ను మనసార స్మరించి వందన సమర్పణ గావించుకొను
చున్నారము.
మా ఆలోచనలకు, ఆచరణకు, అనుభూతికి
అధినాథుడవై నడుప ప్రార్థించుచున్నారము.
నీకివే మా వినమ్రిత నమోవాకములు.

శ్రీమాత




నిన్ను గురించి తెలుసుకోవాలనీ, అధికాధికంగా నిన్నే సేవించాలనే నిరంతర తపన మాలో దినదినాభివృద్ధి జెందుగాక. మా బాహ్యా వ్యాపారములన్ని, నిన్నే, నిన్ను మాత్రమే లక్షించుగాక! ఇది ఎలా సాధ్యము? బాహ్యా కార్యకలాపములనుకూడ అదే దృష్టితో నిర్వర్తించుటువలన సాధ్యము.

ప్రతి వస్తువు, ప్రతి సన్నివేశము నిన్ను అభివ్యక్త పరచుటకు ఒక ద్వారమగు గాక. పరమశాంతికి, పరమనిశ్చలతకు, తృప్తికి నిజమైన మార్గము ఇదే. అప్పుడే జీవితపుష్పము వికసిస్తుంది. జీవితం ఎంతో విశాలమై, ఎంతటి పెను తుపాను వచ్చినా చెక్కుచెదరని ఆనంద తరంగములతో పొంగిపొరలుతుంది.

వినమ్రుడనై సంభ్రమంతో నిన్ను ఆరాధించెదను. వందనము స్వామి! నీకు వందనము!


శ్రీమాత





నేనొక విచిత్రానుభూతిని పొందుచుంటిని. పరిస్థితులన్ని నా పాత అలవాట్లను పూర్తిగా మరచిపోవునట్లు జేయుచున్నవి! ఈ పరిస్థితులెంత తికమకగా, అనిశ్చితంగా వున్నప్పటికి నేనొక నూతనావస్థను పొంది నీ పరమశాంతినే అనుభవించుచుంటిని. 'నేను' అనే భావము పూర్తిగా పోయి, నీ దివ్యమైన శాంతి సజీవంగా రాణిస్తున్నది. ఎటుచూసినా, ఎందుగాంచినా నీ సౌందర్యమే, నీ సామరస్యమే, నీ పరమశాంతమే. అంతా నువ్వే. ధగధగాయమానమైన సూర్యగోళంలో మెరిసేది నువ్వే. శరీరాన్ని పులకింపజేసే మలయమారుతం నువ్వే. అందరి హృదయాలలోను భాసించేది నువ్వే. సర్వజీవుల లోను నివసించేది నువ్వే. సృష్టిలో మొక్క, మాను, ప్రతి జీవరాశి చెప్పేది నీ మాటే. నా కన్నులకింపు కలిగించే ఈ దృశ్యమంతా నీ రూపమే.

శ్రీమాత



ఏ నియంతా శాసించలేని ఓ శక్తి ఉన్నది.
ఏ భౌతిక విజయమూ అందివ్వలేని ఓ ఆనందం ఉన్నది.
ఏ బుద్ధికుశలతకూ అందని ఓ కాంతి ఉన్నది.
ఏ విజ్ఞానానికీ, ఏ తాత్త్వికచింతనకూ అందని ఓ జ్ఞానమున్నది.
ఏ కోరిక వలన కలగని ఓ తృప్తి ఉన్నది.
ఏ మానవీయ బంధమూ యివ్వలేని ఓ ప్రేమతృష్ణ ఉన్నది.
ఎక్కడా, చివరకి మృత్యువులో సైతం దక్కనంత శాంతి ఉన్నది.
ఆ శక్తే, ఆ ఆనందమే, ఆ కాంతే, ఆ జ్ఞానమే, ఆ తృప్తే, ఆ ప్రేమే, ఆ శాంతే – అంతా ఆ దివ్యానుగ్రహపు వెల్లువ.

శ్రీమాత



నీకు దేవుడు కావాల్నంటే ఎంతో దూరం వెళ్ళనవసరం లేదు. ఆయన నీ లోనే, నీ అంతరంగంలోనే వుంటాడు. నీ అగాధంలో ధగధగాయమానంగా మెరిసిపోతుంటాడు. నిన్ను ప్రేమలోను, శాంతిలోను, జ్ఞానంలోను ముంచెత్తుతాడు. నీ వాయనతో సమైక్యమైనప్పుడు నిన్ను జ్యోతిర్మయము, చైతన్యవంతము చేయగలడు.

అయితే మొదట నీ మనస్సును కుదుటపరచాలి. శాంతింపచేయాలి. మనిద్దరం కలిసి నీలో చెలరేగుతున్న ఈ గందరగోళాన్నంతా హతమార్చెదము. అప్పుడే నీ అంతర్జ్యోతిని దర్శించి దానితో ఐక్యము జెందెదవు. అదే నీకు నూతనజన్మ!

శ్రీమాత